క్లుప్తంగా

సాయిబాబా మందిర నిర్మాణానికి శ్రీకారం



రాజయ్యపేటలో బాబా మందిర శంకుస్థాపనలో పాల్గొన్న అదీప్‌రాజ్

పెందుర్తి: మండలంలోని రాజయ్యపేట పంచాయతీ అప్పన్నపాలెంలో నూతనంగా నిర్మించనున్న శిరిడీ సాయిబాబా మందిర నిర్మాణానికి గురువారం శాస్త్రోక్తంగా శ్రీకారం చుట్టారు. ముందుగా ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం శంకుస్థాపన ఘట్టాన్ని నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్‌రాజ్ మాట్లాడుతూ బాబా మందిర నిర్మాణానికి తన వంతు సహకారం అందిస్తానని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు ఉప్పిలి కనకరాజు, కోడిగుడ్ల దేవిసాంబ, మధుపాడ అంజి, గొరపల్లి శ్రీను, బొడ్డు సూర్యప్రకాష్, రాయవరపు సత్తిబాబు, దిలీప్, సత్తిబాబు, పీఎస్ఎస్ఆర్ పాత్రుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గమాంబ పండగ



అమ్మవారిని దర్శించుకుంటున్న అదీప్‌రాజ్

పరవాడ: మండలంలోని పెదముషిడివాడ పంచాయతీ పచ్చికూరవానిపాలెం గ్రామ దేవత దుర్గమాంబ వార్షిక పండగను గురువారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ఉదయం నుంచి అభిషేకాలు, కుంకుమ పూజలు జరిపారు. కానుకలు, మొక్కులు సమర్పించారు. అగ్ని గుండాలు తొక్కారు. సాయంత్రం జరిగిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్‌రాజ్, పెదముషిడివాడ వైస్ సర్పంచ్ నరేష్, గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు అమ్మవారిని దర్శించుకున్నారు.

యోగాంధ్రపై చిత్రలేఖన పోటీ



చిత్రాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో పద్మజ

సబ్బవరం: యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో యోగాపై చిత్రలేఖన పోటీలను గురువారం నిర్వహించారు. ఈ పోటీలను మూడు విభాగాలుగా 10–18 ఏళ్లు, 19–35, ఆ పైబడిన వయస్సుల వారికి కేటగిరీలు వారీగా జరిపారు. పోటీల్లో అధికంగా 10–18 ఏళ్ల మధ్య వయస్కులే పాల్గొన్నారు. విజేతలకు ఎంపీడీవో పద్మజ చేతుల మీదుగా బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎంఈవో రవీంద్రబాబు, ఈవోపీఆర్డీ చైతన్య, ఈపీడీసీఎల్ ఏఈ వీరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అదృశ్యమైన బాలుడి ఆచూకీ లభ్యం

పెందుర్తి: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని అప్పన్నపాలేనికి చెందిన బాలుడి(12) ఆచూకీ లభ్యమైనట్లు సీఐ కె.వి.సతీష్‌కుమార్ తెలిపారు. మూడు రోజుల క్రితం ఇంటి నుంచి నూడుల్స్ కోసం వెళ్లిన ఆ బాలుడు తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు నగరంలో బాలుడి ఆచూకీని గురువారం కనుగొని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

పెదశేష వాహనంపై ఊరేగిన తిరుమలేశుడు



శ్రీవారి పెదశేష వాహన సేవలో పాల్గొన్న ఎస్టీబీఎల్ అధినేత బాలాజీ దంపతులు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్‌లోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో శ్రీవారి ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఈ నెల 3 నుంచి 7వ తేదీ వరకు జరగనున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం శ్రీవారి పెదశేష వాహన సేవను దివ్యక్షేత్రం మాడవీధుల్లో అశేష భక్త జనసందోహం మధ్య ఘనంగా నిర్వహించారు. ఎస్టీబీఎల్ అధినేత బాలాజీ దంపతులు పెదశేష వాహన సేవలో పాల్గొన్నారు. సాయంత్రం శ్రీవారి గరుడ వాహన సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ పరిసరాలన్నీ గోవింద నామస్మరణతో మార్మోగాయి. దివ్యక్షేత్రం వద్ద మహిళల కోలాటం ఆకట్టుకుంది. దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు ఘనంగా జరుగుతున్నాయి.

తప్పని తిప్పలు

రేషన్ సరకుల కోసం గంటల తరబడి నిరీక్షణ
సర్వర్ల డౌన్ పేరిట ఇబ్బందులు
దూరాభారం, వ్యయప్రయాసలు
వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే బాగుండేదంటున్న లబ్ధిదారులు

గత కాలము మేలు వచ్చె కాలము కంటెన్.. అన్న మహాభారత హితోక్తి చంద్రబాబు పాలనకు సరిగ్గా సరిపోలుతుంది! తనంత తానుగా పది కాలాల పాటు గుర్తుండిపోయే ఏ ఒక్క ప్రజా సంక్షేమ కార్యక్రమాన్నీ అమలు చేసింది లేదు. వేరొకరు ప్రవేశపెట్టిన మంచి పథకాన్ని కొనసాగించేంత సద్బుద్ధీ ఉండదు. అందుకే ఆయన అధికారంలో ఉన్నన్నాళ్లూ.. అంతకు ముందు ప్రభుత్వాల పాలనను నెమరువేసుకోవడమే మా పని అంటూ ప్రజలు బాబు తీరును ఎండగడుతున్నారు. పాత పద్ధతిలో రేషన్ డిపోల వద్ద పడిగాపులు కాయాల్సి రావడంపై గగ్గోలు పెడుతున్నారు.



తోటవీధిలో రేషన్ కోసం వేచి ఉన్న లబ్ధిదారులు

సింహాచలం: రేషన్ సరకుల కోసం కార్డుదారుల ఇబ్బందులు కొనసాగుతున్నాయి. జీవీఎంసీ పరిధి 98వ వార్డులోని రేషన్ డిపోల వద్ద గత నాలుగు రోజులుగా లబ్ధిదారులు పడిగాపులు కాస్తున్నారు. ఎండ ప్రభావం ఎక్కువగా ఉండటంతో త్వరగా రేషన్ తీసుకుని ఇళ్లకు వెళ్లిపోవచ్చని ఉదయాన్నే డిపోల వద్దకు చేరినా ఫలితం నిల్. జగన్ ప్రభుత్వంలో ఇంటి వద్దకే రేషన్ వచ్చేదని, ఆ పద్ధతే బాగుండేదని వారంతా చెప్పుకొచ్చారు. అందిన సరకుల్ని మండుటెండలో నెత్తిన, భుజంపై వేసుకుని, నడుచుకుంటూ ఇంటికి వెళ్లాల్సి వస్తోందని పలువురు లబ్ధిదారులు తమ ఇబ్బందులను బాహాటంగానే వెల్లగక్కుతున్నారు.

మొరాయిస్తున్న సర్వర్

సర్వర్ పలుమార్లు మొరాయించడంతో రేషన్ తీసుకునేందుకు ఇబ్బందులు తప్పట్లేదు. దీంతో లబ్ధిదారులు గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. ఎప్పుడు సర్వర్ పనిచేస్తుందో తెలియక, దూర ప్రాంతాల వారు ఇళ్లకు తిరిగి వెళ్లలేక రేషన్ డిపోల వద్దే పడికాపులు కాస్తున్నారు. తమ నివాసాలకు రెండు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న రేషన్ డిపోలను కేటాయించడంతో చాలా మంది మహిళలు, వృద్ధులు ఆటోలు మాట్లాడుకుని, బస్సుల్లో డిపోల వద్దకు వచ్చారు. రవాణా చార్జీలు వీరికి అదనపు భారంగా మారాయి.



సాయినగర్‌లో రేషన్ డిపో వద్ద సర్వర్ పనిచేయకపోవడంతో నిరీక్షిస్తున్న లబ్ధిదారులు

ఈ పద్ధతేం బాగాలేదు



వైస్సార్‌సీపీ ప్రభుత్వంలో రేషన్ బండి ద్వారా ఇంటింటికీ వచ్చి రేషన్ సరకులు అందించిన పద్ధతే బాగుంది. పాత పద్ధతిలోకి మారడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. సర్వ ర్లు పనిచేయక గంటల తరబడి రేషన్ దుకాణాలవద్ద పడికాపులు కాయాల్సి వచ్చింది. ఇంట్లో పని మానుకుని మరీ రేషన్ సరకుల కోసం వచ్చా. చాలా సేపు నిరీక్షించాల్సి వచ్చింది. – నాగమణి, పోస్టాఫీసు వీధి

ఎండలో నడిచి వచ్చా



అడవివరంలోని కుమ్మరి దిబ్బ ఏరియాలో ఉన్న మాఇంటి దగ్గర నుంచి తోటవీధిలో ఉన్న రేషన్ డిపోకి ఎండలో నడిచి వచ్చా. పలువుమార్లు సర్వర్ పనిచేయకపోవడంతో వేచి ఉండాల్సి వచ్చింది. రేషన్ తీసుకున్నాక ఎండలో తిరిగి వెళ్లేందుకు ఇబ్బంది పడ్డా. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో మాఇంటి వద్దకే రేషన్ బండి వచ్చి సరకులు ఇచ్చేది. ఆ పద్ధతే చాలా బాగుంది.

– బొమ్మిడి తాతారావు, వృద్ధుడు, అడవివరం



ఆటో మాట్లాడుకుని 2 కి.మీ. వచ్చాం

మేం విజినిగిరిపాలెం నుంచి తోట వీధిలో ఉన్న రేషన్ డిపో వద్దకు రెండు కిలో మీటర్లు ప్రయాణించి వచ్చాం. అందరం కలిసి ఆటో మాట్లాడుకోవాల్సి వచ్చింది. తీరా వచ్చాక సర్వర్ పనిచేయకపోవడంతో చాలాసేపు వేచి ఉన్నాం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మా ఇంటి వద్దకే రేషన్ వాహనాలు వచ్చేవి. ఎలాంటి ఇబ్బందులు లేకుండా రేషన్ తీసుకునేవాళ్లం.

– విజినిగిరిపాలెం మహిళలు

సర్వర్‌తో ఇబ్బందులు



సాయినగర్‌లో ఉన్న రేషన్ డిపోకి సరకుల కోసం వచ్చాం. సర్వర్ పనిచేయక గంటల తరబడి వేచి ఉన్నాం. ఈ పద్ధతేం బాలేదు. గత ప్రభుత్వంలో ఇంటివద్దకే వచ్చి రేషన్ ఇచ్చే పద్ధతే బాగుంది. రేషన్ బండి ఇంటి దగ్గరకు వచ్చేసరికి ఇంట్లో ఎవరో ఒకరు వెళ్లేవాళ్లం. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. పనులు మానుకుని రోజంతా వేచి ఉండాల్సిన పరిస్థితి ప్రస్తుతం మళ్లీ వచ్చింది.

– రమణమ్మ, అప్పయ్యమ్మ, సాయినగర్

బకాయి వేతనాల కోసం ఉపాధి కూలీల నిరసన



కలపాకలో ఆందోళన చేస్తున్న ఉపాధి కూలీలు

పరవాడ: ఉపాధి హామీ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలుచేయాలని సిటు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ అన్నారు. ఉపాధి పథకం బకాయి వేతనాలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ కలపాక గ్రామంలో ఉపాధి కూలీలు గురువారం ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ బకాయి పడ్డ 8 వారాల వేతనాలను వెంటనే విడుదల చేస్తూ ప్రతి కుటుంబానికి 200 పని దినాలు, రోజుకు రూ.600 వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకాన్ని బీజేపీ ప్రభుత్వం నిర్వీర్యం చేయాలని చూస్తోందని, దీనిని అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. బకాయి వేతనాలను వెంటనే చెల్లించని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

తుది దశకు వేసవి శిక్షణ శిబిరం



శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

పెందుర్తి: స్థానిక శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరం శుక్రవారంతో ముగియనుంది. 40 రోజుల శిక్షణలో భాగంగా గురువారం కథలు చదవడం, రాయడం, చెప్పడంపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. చిన్నారులకు నీతి కథలను బోధించారు. అనంతరం సామూహిక పుస్తక పఠనం చేయించారు. ఇంగ్లిష్ మెళకువలు నేర్పారు. పలు ఆటలు ఆడించారు. ధ్యానం ఉపయోగాలను వివరించారు. ముగింపు సభలో గత 40 రోజులుగా వివిధ అంశాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతుల ప్రదానం చేయనున్నట్లు గ్రంథాలయాధికారి బి.సూర్యకళ తెలిపారు.

ఫార్మా ఉద్యోగుల రక్తదానం



రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులకు మెమెంటో అందిస్తున్న సుబ్బారావు



శిబిరంలో రక్తదానం చేస్తున్న ఫార్మా పరిశ్రమల ఉద్యోగులు

పరవాడ: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జేఎన్‌పీసీఎంఏ సహకారంతో ఫార్మాసిటిలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చేపట్టిన రక్తదాన శిబిరంలో ఫార్మా పరిశ్రమలకు చెందిన 48 మంది సభ్యులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. దాతల నుంచి సేకరించిన రక్తాన్ని భారత రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా రక్తమార్పిడిపై ఆధారపడే తలసేమియా రోగులకు అందించనున్నట్లు సొసైటీ ప్రతినిధులు తెలిపారు. రక్తదాన శిబిరంలో స్వచ్ఛందంగా పాల్గొని రక్తాన్ని దానం చేసిన ఫార్మా ఉద్యోగులకు జేఎన్‌పీసీ తయారీదారుల సంఘ కార్యదర్శి జెట్టి సుబ్బారావు ప్రత్యేక ధన్యావాదాలు తెలిపారు.

అప్పన్నకు ఘనంగా ఆర్జిత సేవలు



కంకణధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణపుష్పార్చన జరిపారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం జరిపారు. 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులను వేంజేపచేసి, ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

‘రజనీ కల్యాణం’ చిత్ర యూనిట్ సందడి



ముత్యాలమ్మ గుడిలో క్లాప్ కొడుతున్న యూనిట్

సబ్బవరం: మండలంలోని సబ్బవరం శివారు చినగొల్లలపాలెం ముత్యాలమ్మతల్లి ఆలయం వద్ద వారాహి క్రియేషన్స్ యూనిట్ గురువారం సందడి చేసింది. గ్రామీణ నేపథ్యంలో రజనీకల్యాణ్ పల్ల దర్శకత్వంలో రూపుదిద్దుకోనున్న రజనీ కళ్యాణం చిత్ర షూటింగ్‌ను దర్శకుడు తన తల్లిదండ్రులతో పాటు సబ్బవరం ఉప సర్పంచ్ మండల లక్ష్మణ చేతుల మీదుగా అమ్మవారి సన్నిధిలో క్లాప్ కొట్టి, ప్రారంభించారు. చిత్ర నటీనటులను మీడియాకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు రజనీకల్యాణ్ మాట్లాడుతూ గ్రామీణ నేపథ్యంలో, రాజుల పరిపాలన, అప్పటి ప్రజల పరిస్థితిని ఇతివృత్తంగా తీసుకుని చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. రెండు షెడ్యూళ్లలో ఈ సినిమా షూటింగ్‌ను పూర్తిచేస్తామన్నారు. సబ్బవరం పరిసర ప్రాంతాల్లోని కళాకారులకు అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. అనకాపల్లి జిల్లా యాదవ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్ల తాతారావు మాట్లాడుతూ దర్శకుడు కల్యాణ్ ఇక్కడి రైతు కుటుంబంలో జన్మించినా, సినీ పరిశ్రమపై మక్కువతో ఇక్కడి వరకు వచ్చారని తెలిపారు. పల్ల సత్యనారాయణ, పల్ల అప్పలనాయుడు నిర్మాణంలో రూపొందుతున్న ఈ చిత్రంలో నటీనటులు గెడ్డం రమణ, శర్వాణి, సుస్మిత, కెమెరామన్‌గా రమణ, డ్యాన్స్ మాస్టర్‌గా దాలినాయుడు, ఫైట్ మాస్టర్‌గా సంతోష్ కుమార్, రచయితగా డి.శ్రీనివాసరావు పనిచేస్తున్నారు.

పర్యావరణ పరిరక్షణతోనే భావితరాల మనుగడ

ఊరూ వాడా ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం



మొక్కలు పంపిణీ చేస్తున్న వనమాలి గార్డెన్ గ్రూప్ ప్రతినిధులు



పెందుర్తిలో పర్యావరణ దినోత్సవ ప్రతిజ్ఞ చేస్తున్న మేయర్ పీలా శ్రీనివాసరావు, జీవీఎంసీ సిబ్బంది

పెందుర్తి: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని మేయర్ పీలా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం పెందుర్తిలో మొక్కలు నాటారు. జీవీఎంసీ అధికారులతో కలిసి ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలంతా మొక్కలు నాటడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం వంటి కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. పర్యావరణాన్ని పరిరక్షించుకుంటేనే భావితరాల భవిష్యత్‌కు భద్రత అన్నారు. జోనల్ కమిషనర్ కె.హేమావతి, ఏఎంహెచ్‌వో బి.అప్పలనాయుడు, ఉప కార్యనిర్వాహక ఇంజినీర్ కె.ప్రవీణ్‌కుమార్, సహాయ ఇంజినీర్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

- స్థానిక ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ఆవరణలో, సబ్బవరం తవ్వవానిపాలెం, ఇతర ప్రాంతాల్లో ఆదర్శ్ విద్యార్థులు మొక్కలు నాటారు. కళాశాల కార్యదర్శి టి.థియోఫిలాస్, ప్రిన్సిపాల్ ఎన్ఈ ఫ్లోరా, వైస్ ప్రిన్సిపాల్ ఎ.శ్రీనివాసరావు, అధ్యాపకుడు సింహాచలం, కళాశాల ప్రతినిధి శ్రీను, విద్యార్థులు పాల్గొన్నారు.
- పెందుర్తి ప్రాంత వనమాలి గార్డెన్ గ్రూప్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఎస్సీ బాలికల వసతి గృహం వార్డెన్, వనమాలి గ్రూప్ ప్రతినిధి ఆతవ సత్యవతి, మరో ప్రతినిధి పెతకంశెట్టి భాగ్యరేఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర కాలుష్య నివారణ సంస్థ సహకారంతో మొక్కలు నాటారు. అనంతరం పండ్ల, ఉద్యాన మొక్కలను పంపిణీ చేశారు. గ్రూప్ ప్రతినిధులు అన్నపూర్ణ శేఖర్, గోకాడ సూర్యప్రకాష్ రావు, మడగల గోవిందరావు, శారదాదేవి, వరలక్ష్మి, అరుణ తదితరులు పాల్గొన్నారు.
- నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ గొర్లె రాము నాయుడు ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పర్యావరణ దినోత్సవం సందర్భంగా తహసీల్దార్ ఎం.ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. నియోజకవర్గంలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తున్నట్లు రామునాయుడు పేర్కొన్నారు. ఎన్నికల విభాగం డీటీ అర్జునరావు, సర్వేయర్ రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఎస్ఎఫ్ పరిశ్రమలో మొక్కలు నాటిన ఉద్యోగులు



ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో మొక్కలు నాటుతున్న కరస్పాండెంట్ థియోఫిలాస్, విద్యార్థులు

సబ్బవరం: పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత కావాలని, మొక్కలు నాటే కార్యక్రమాన్ని విరివిగా చేపట్టాలని జిల్లా రిజిస్ట్రార్ డాక్టర్ కె.మన్మధరావు తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మొక్కలు నాటారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంతోపాటు, ఇంటి ఆవరణలో మొక్కలు నాటడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో సబ్ రిజిస్ట్రార్ జిలానీ బేగం, సీనియర్ అసిస్టెంట్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.



సబ్బవరం రిజిస్ట్రార్ కార్యాలయంలో మొక్క నాటిన జిల్లా రిజిస్ట్రార్ మన్మధరావు తదితరులు

పరవాడ: మండలంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈదులపాక బోనంగి వీఆర్ఎండీఏ బల్క్ ల్యాండ్, పవర్ సిటీ వద్ద సిద్ధి వెంకటేశ్వర హార్టికల్చర్ అండ్ సివిల్ వర్క్స్ ప్రతినిధులు ఎల్.అప్పలనాయుడు, ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో కూటమి నాయకుడు పంచకర్ల ప్రసాద్ మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతి ఒక్కరు ఇంటికో మొక్కను నాటాలని పిలుపునిచ్చారు. ఈ.బోనంగి, పరవాడ సర్పంచ్‌లు బొద్దపు శ్రీనివాసరావు, సిరపరపు అప్పలనాయుడు, గొర్లివానిపాలెం మాజీ సర్పంచ్ గొర్లి కనకారావు, కూటమి నాయకులు బుగిడి రామగోవిందరావు, గొర్లి శ్రీనివాస్, పైల రామారావు, మేడిశెట్టి అప్పారావు, ఎల్.అప్పలనాయుడు, రెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

- రావాడలో కూటమి నాయకుడు వియ్యపు చిన్న మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించి, మాట్లాడుతూ ప్రతి ఒక్కరు విరివిగా మొక్కలు నాటడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు.
- జేఎన్ ఫార్మాసిటీలోని ఎస్ఎస్ఎఫ్ పరిశ్రమలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పరిశ్రమ ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు ఘనంగా నిర్వహించారు. పరిశ్రమ ఆవరణలో మొక్కలు నాటారు. ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల వాడకాన్ని తగ్గించేందుకు వీలుగా సిబ్బందికి జనపనారతో తయారు చేసిన బ్యాగులను పంపిణీ చేశారు. పరిశ్రమ హెచ్ఆర్ హెడ్ అనిత సాహు మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యాన్ని కాపాడడం, ప్లాస్టిక్ వినియోగ నియంత్రణ ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో పరిశ్రమ ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.



అడవివరంలో నార సంచులను ప్రదర్శిస్తున్న జేడీ ఫౌండేషన్ సభ్యులు

సింహాచలం: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ప్లాస్టిక్ సంచులను వాడొద్దని, నార లేదా గుడ్డతో తయారుచేసిన సంచులనే వాడాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పలవురికి నార సంచులు అందించారు. అనంతరం విత్తన బంతులు విసిరే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జేడీ ఫౌండేషన్ ఉత్తరాంధ్ర కన్వీనర్ కారుమూడి అను, జీవీఎంసీ 8వ జోన్ శానిటరీ సూపర్‌వైజర్ ఎస్.ఎస్.కె.వి.రమణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

నువ్వు చేను పచ్చగా..



వేసవి పంట నువ్వు చేనుకు ఇటీవల కురిసిన వర్షాలు ఊపిరినిచ్చాయి. దీంతో వేసిన ప్రతి చోటా చేను పచ్చగా కళకళలాడుతోంది. ఖరీఫ్ సీజన్‌కు ముందు పెందుర్తి మండలంలో చాలా చోట్ల నువ్వు చేను సాగు చేయడం ఆనవాయితీ. విత్తనాలు చల్లిన ఆరంభంలో తప్ప, ఆ తర్వాత పెద్దగా నీరు అవసరం లేకపోవడంతో రైతులు ధైర్యంగా నువ్వుచేను సాగుకు ముందుకొస్తారు. ఈసారి వీరికి వాతావరణం కూడా ఎంతగానో సాయపడింది. దీంతో పంట దిగుబడికి ఢోకా ఉండదని రైతులు ఆనందంగా ఉన్నారు.

\- పెందుర్తి